క్లుప్తంగా

ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయిని చిన్నమ్మలు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఉపాధ్యాయులు

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా పని చేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పరవాడ చిన్నమ్మలును హెచ్ఎం రమేష్ ఆధ్వర్యంలో ఆపాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మంగళవారం సన్మానించా రు. అతిథిగా హాజరైన ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి చిన్నమ్మలు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఎం డాక్టర్ జీవనరాణి

తెర్లాం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందని, వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ)డాక్టర్ ఎస్.జీవనరాణి సూచించారు. పెరుమాళి పీహెచ్సీలో మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. పీహెచ్సీలో ఓపీ నమోదు, మందుల నిల్వలు,వ్యాక్సినేషన్ తదితర వివరాలను స్థానిక డాక్టర్ ఎస్.వెంకటేష్ను ఆరా తీశారు. జ్వరపీడితులు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలందించాలని చెప్పారు. డీఎంహెచ్ఓ వెంట ఆయుష్ వైద్యులు శెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, తదితరులు

బొబ్బిలి: స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బంది మంగళవారం అన్నదానం చేశారు.డీఎస్పీ జి.భవ్యారెడ్డి ముందుగా ఆలయంలో పూజలు చేసి,అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దీని వల్ల ప్రశాంత జీవనం సాగించవచ్చన్నారు. సీఐ కె. సతీష్కుమార్, ఎస్ఐలు రమేష్కుమార్, జ్ఞాన ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

398మంది దివ్యాంగులకు పింఛన్ నిలిపివేత

బొబ్బిలిరూరల్: మండలంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న 1,112 మందిలో 398 మం దిని అనర్హులుగా గుర్తించి, వారికి ప్రభుత్వం పింఛన్ తొలగించిందని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇటీవల వైద్య బృందం చేపట్టిన సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వైకల్యశాతం తనిఖీల్లో 398 మందిని పింఛన్ పొందేందుకు అనర్హులుగా తేల్చారని తెలిపారు. వీరికి సెప్టెంబర్ నెల నుంచి పింఛన్ నిలిపివేస్తున్నామని చెప్పారు. దివ్యాంగ పింఛన్ పొందుతున్న అరవైఏళ్లు నిండిన మరో 101 మందిని వృద్ధాప్య పింఛన్ కేటగిరిలోకి మార్చామని వివరించారు.

ఎన్నికల హామీలు గాలికి



కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న రాజేష్, తదితరులు

రాజాం: వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో పాటు అదనంగా మరో 143 పథకాలు అమలు చేస్తామని, వీటికి తోడు సూపర్ సిక్స్ పథకాలు అదనమని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, కానీ సీఎం అయిన తర్వాత ఆ హామీలన్నీ గాలికి వదిలేశారని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలసలో మంగళవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ముందు టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేశారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడు తూ కూటమి చేతిలో ప్రజలు మోసపోయారని, టీడీపీ కార్యకర్తలు పలుచోట్ల దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో పేట్రేగిపోతు న్నారని అన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.వైఎస్సార్సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ ప్రచార కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆసపు సూర్యం, పార్టీ రాజాం పట్టణ కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, నాయకులు సలాది సతీష్, బగ్గ హరనాథ్, ఉంగటి గోపి, వాన అప్పలనాయుడు, గుండ అసిరినాయుడు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లు.. అవస్థల ప్రయాణాలు

బొబ్బిలిరూరల్: అలజంగి- కారాడ గ్రామాల మధ్య అడుగుకో గుంతతో ఉన్న రోడ్డు





బొబ్బిలిరూరల్: అధ్వానంగా ఉన్న బొబ్బిలి- అలజంగి రోడ్డు



తెర్లాం: శిథిలమైన ఎం.ఆర్ అగ్రహారం-ఉత్తరావల్లి రోడ్డు



తెర్లాం:గోతులమయమైన నందిగాం-కుసుమూరు బీటీ రోడ్డు



రేగిడి: పాలకొండ-రాజాం ప్రధాన రహదారిలో మజ్జిరాముడుపేట వద్ద చిత్తడిగా మారిన రోడ్డు



రేగిడి: అంబకండి గ్రామ రహదారిలో ఏర్పడిన గోతులు



రేగిడి: ఉంగరాడమెట్ట-వన్నలి రోడ్డులో పెద్ద గొయ్యి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత, గజానికో గొయ్యి అన్నచందంగా కనిపిస్తున్నాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.తాజాగా కురిసిన వర్షాలకు రోడ్లపై ఉన్న పెద్ద పెద్ద గుంతలు నీటితో నిండి చెరువులను తలిపిస్తున్నాయి.ఈ మార్గాల్లో ప్రయాణించే వారు నరకం చూస్తున్నారు. కొన్ని రోడ్లు వర్షానికి చిత్తడిగా మారాయి. గుంతల్లో నీరు చేరడంతో వాహన చోదకులు వాటిని అంచనా వేయలేక వాహనాలను వాటి గుండా నడిపేటప్పుడు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. గోతుల వల్ల వాహనాలు కూడా పాడవుతున్నాయని వాహనదా రులు వాపోతున్నారు. రేగిడి మండలంలోని ఖండ్యాం, తాటిపాడు, ఉణుకూరు, పుర్లి, దేవుదల, కె.వెంకటాపురం తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వంగర మండలంలోని మద్దువలస నుంచి జగన్నాథవలస మీదుగా నీలయ్యవలస వెళ్లే మెటల్ రోడ్డు దమ్ముమడిలా మారింది. ఇటీవల ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఈ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు కానీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. బొబ్బిలి మండలంలో అలజంగి నుంచి కారాడ,పినపెంకి గ్రామాలకు వెళ్లే రోడ్డు ఎక్కడికక్కడే గోతులు తేలింది. రామభద్రపురం మండల కేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర అడుగుకో గుంత ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.అదే రూట్లో బొబ్బిలి గ్రోత్ సెంటర్, రాయఘడకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ భారీ వాహనాలు, వర్షాల వల్ల గుంతలు మరింత పెద్దవిగా మారాయి. సంక్రాంతి పండగ నాటికి రాష్ట్రంలో గుంతలు లేని, అద్దంలా మెరిసే రోడ్లను చూస్తారని సీఎం చంద్రబాబు చెప్పారు. కానీ సంక్రాంతి పండగ వెళ్లిపోయి ఎనిమిది నెలలు కావస్తున్నప్పటికీ ఎక్కడా రోడ్లు బాగుచేసిన దాఖలాలు లేవు. కొన్ని రోడ్లకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసినప్పటికీ అవి కూడా మళ్లీ పాడైపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి నెట్వర్క్



తెర్లాం: సతివాడ నుంచి నెమలాం వెళ్లే రోడ్డు దుస్థితి



వంగర: మద్దువలస వద్ద దమ్ముమడిలా ఉన్న రోడ్డు



రామభద్రపురం: రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వైభవంగా ఆలయాల ప్రతిష్ఠాపన



రాజాం సిటీ: దోలపేటలో పూజలు చేస్తున్న భక్తులు



వంగర: ఎం.సీతారాంపురంలో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

రాజాం సిటీ: పట్టణ పరిధి డోలపేటలోని ఆంజనేయస్వామి ఆలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పొట్నూరు లక్ష్మణరావు, రమాదేవి దంపతులతో వేదపండితులు శర్మ, హరి, మహేష్ పూజలు చేయించారు. అనంతరం సుమారు 8వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఎం.సీతారాంపురంలో..

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురంలో మూడురోజుల పాటు నిర్వహించిన గ్రామదేవత బంగారుతల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రామస్తులు సమష్టిగా నిర్మించుకున్న ఆలయంలో మూడు రోజుల పాటు పూజలు, అభిషేకాలు, ఘటాలతో తిరువీధి చేశారు. ఆలయం వద్ద గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



బొబ్బిలిబొబ్బిలి సీహెచ్సీ వద్ద ఫొటో గ్రాఫర్ల ప్రదర్శన



బొబ్బిలి: మృతిచెందిన ఫొటో గ్రాఫర్ ప్రసాద్ తల్లికి ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

బొబ్బిలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పట్టణంలోని ఫొటో గ్రాఫర్లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లంతా పట్టణంలో ర్యాలీ చేశారు. లోకబంధు రెసిడెన్సీలో ఫొటోగ్రఫీ డేకు సంబంధించి సీనియర్లు, జూనియర్లకు పలు సలహాలు సూచనలు అందజేశారు. సీహెచ్సీలో రోగులకు వైద్యాధికారి జి.శశిభూషణరావు చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఆవాల సన్యాసిరావు, రవిశంకర్,సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రంగ,రాజన్,కోశాధికారి మురళి పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం సిటీ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో రాజాంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర యూనియన్ నాయకుడు ఎస్.సతీష్ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా గ్రామీణ ప్రాంత ఫొటో గ్రాఫర్లు అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇటీవల మృతిచెందిన రాజాంకు చెందిన ఫొటో గ్రాఫర్ ప్రసాద్ కుటుంబానికి సంఘం తరఫున రూ.13వేల ఆర్థిక సాయం అందించారు. రాజాం యూనియన్ అధ్యక్షుడు ఎం.చందు, కార్యదర్శి పొగిరి రాము, మోద్రస్ కృష్ణ, సీతారాం, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ముగడమ్మతల్లి వారాల పండగ



అమ్మవారి గుడికి వెళుతున్న గ్రామస్తులు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో ముగడమ్మతల్లి వారాల పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా గ్రామ శివారులోని అమ్మవారి గుడికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వంగర: వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ తట్టికోట కన్నబాబు రైతులకు సూచించారు. వంగర, ఎం.సీతారాంపురం గ్రామాల్లో వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాలు తగ్గిన వెంటనే పంటకు వేయాల్సిన ఎరువులు, పిచికారీ చేయాల్సిన పురుగు మందులు గురించి రైతులకు వివరించారు.ఆయన వెంట వీఏఏ శివ ఉన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత

తెర్లాం: మండలంలోని నందిగాం, తెర్లాంలో గ్రామాల్లోని ప్రధాన సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తహసీల్దార్ జి.హేమంత్కుమార్ ఆదేశాల మేరకు వీఆర్ఓలు జేసీబీ సహాయంతో మంగళవారం తీయించారు. గత ఏడాది తెర్లాం గ్రామంలో పీహెచ్సీ వద్ద ఉన్న మంగళి గెడ్డ గ్రొయిన్ ద్వారా నీరు పూర్తిస్థాయిలో ప్రవహించకపోవడంతో కాజ్వేపై నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. అలాగే నందిగాంలో కాలువల ద్వారా నీరు పారక గ్రామంలోకి నీరు చేరింది. గతే డాది మాదిరి సమస్య పునరావృత్తంగా కాకుండా ఉండేలా తెర్లాం మంగళి గెడ్డ గ్రొయిన్ వద్ద, నందిగాం సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పూడికను, పిచ్చి మొక్కల తొలగింపు పనులను ఆయా గ్రామాల వీఆర్ఓలు డి.రాము, శ్రీనివాసరావు చేయించారు.

అవగాహన

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ ఎం శివ అన్నారు.ఆరికతోటలో మంగళవారం పొలంపిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరిలో సస్యరక్షణ చర్యలపై అవగా హన కల్పించారు.వరి నాట్లు సమయంలో నారు చివర్లు తుంచడం వల్ల పీక పురుగు ఉధృతిని నివా రించవచ్చని తెలిపారు. నాట్లు వేసిన ఐదు రోజు ల్లో కలుపు మందు జల్లుకోవాలని సూచించారు.అలాగే 15 రోజుల తర్వాత కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

విద్యార్థులకు వ్యాక్సినేషన్

రాజాం: బొద్దాం పీహెచ్సీలో బాలబాలికలకు వైద్య సిబ్బంది మంగళవారం టీటీ వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి సిద్ధేశ్వరి మాట్లాడుతూ 10 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాలబాలికలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు రకాల మానసిక రుగ్మతలు నివారించేందుకు ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందన్నా రు.స్పెషల్ డ్రైవ్లో భాగంగా ఈనెల 23 వరకూ ఈకార్యక్రమం కొనసాగుతుంద ని చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

రాజాం: కంచరాం, గురవాం తదితర గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు, సచివా లయ ఉద్యోగులు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన క్లాప్ మిత్రలకు తడి,పొడి చెత్తసేకరణ, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. కంపోస్టు పిట్లలో తడిచెత్త వేయడం, వాటిని నిల్వ ఉంచే పద్ధతిని వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



వెంకంపేట వద్ద నీటమునిగిన వరి, చెరకు పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకంపేట, తునివాడ, కొత్తచెలికానివలస గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకులలోవకట్టగెడ్డ ఆధునికీకరణ పనులను చేపట్టక పోవడం వల్లే పంటపొలాలు ముంపుబారినపడుతున్నాయని, రైతులకు అపారనష్టం సంభవిస్తోందని అన్నారు. సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి నాట్లు వేసిన కొద్దిరోజుల్లోనే వరద ముంచెత్తడంతో పంటలు పూర్తిగా పాడయ్యే అవకాశాలు ఉంటాయని, అధికారులు పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.చెరకుపంటకు కూడానష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్లు కెంబూరు వెంకటేశ్వరరావు, బుగత కృష్ణ, కడగల వాసు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



సిబ్బందితో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ వీధి కుళాయిల ద్వారా క్లోరినేటెడ్ తాగునీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటిని సరఫరా చేసే బాధ్యత ఆ పరిధిలోని సచివాలయ కార్యదర్శులదేనన్నారు. అలాగే వీధిలైట్లు నిత్యం వెలుగుతున్నాయా లేదా అని పర్యవేక్షించాలన్నారు. డీఈఈ కిరణ్కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ పరిశీలన



తోటపల్లి ప్రధాన కుడికాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తెర్లాం: మండల కేంద్రం తెర్లాం మీదుగా వెళుతున్న తోటపల్లి ప్రధాన కుడికాలువలో నీటి ప్రవాహాన్ని మండల అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. తహసీల్దార్ జి.హేమంత్కుమార్, ఎంపీడీఓ రేగి రాంబాబు, తోటపల్లి ప్రాజెక్ట్ ఏఈ, వీఆర్ఓ డి.రాము స్థానిక పీహెచ్సీ వద్ద ఉన్న తోటపల్లి ప్రధాన కుడికాలువ వద్దకు వెళ్లి వర్షాల కారణంగా కాలువలో వస్తున్న వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కాలువకు ఎక్కడైనా లీకులు ఉన్నాయా, ఎక్కడైనా గండిపడే అవకాశం ఉందా అని పరిశీలించారు. కాలువలో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని తోటపల్లి ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులకు తహసీల్దార్ సూచించారు.

మేమేం పాపం చేశాం..



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తులు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి అక్కన్న అగ్రహారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు పొదిలాపు వాసుదేవరావు, చెవిటి, మూగ అయిన ఆయన భార్య, వృద్ధురాలైన ఆయన తల్లి. వాసుదేవరావు గత 14 ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నారు. మూగ, చెవిటి అయిన ఆయన భార్యకు కానీ, వృద్ధురాలైన ఆయన తల్లికి కానీ పింఛన్ రావడం లేదు. ప్రతీ నెల తనకు వచ్చే పింఛన్తోనే తల్లిని, భార్య, తన ఇద్దరి పిల్లలను పోషించుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈయనకి సెప్టెంబర్ నెల నుంచి పింఛన్ నిలిపివేస్తున్నట్లు రెండు రోజుల క్రితమే అధికారులు ద్వారా నోటీసు అందజేసింది. 40 శాతం తక్కువ వైకల్యం ఉన్నందున పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నప్పటికీ, ఈయనకి 82 శాతం వైకల్యం ఉన్నట్లు గతంలో అధికారులు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు.నోటీసు అందుకున్న వాసుదేవరావు నిర్ఘాంత పోయాడు. కాలు,చేతులు పనిచేయని తనకు పింఛన్ నిలిపివేస్తే కుటుంబ పోషణ సాగేదెలా అని, కుటుంబమంతా రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మేమేం పాపం చేశామని ప్రభుత్వం తమకు ఈ శిక్ష వేసిందని, ఇది అన్యాయమని, తమలాంటి వారి కడుపులు కొట్టడం మంచిపద్ధతి కాదని వాపోయారు. **– రేగిడి**

ఉపాధ్యాయిని వినూత్న ఆలోచన



పర్యావరణ హితం ఓ ఉపాధ్యాయిని వినూత్నంగా ఆలోచన చేశారు. రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో హర్షిత నగర్లో ఉంటున్న ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణి మంగళవారం తన నివాసంలో శ్రావణమాసం సందర్భంగా లలితాపారాయణం చేశారు. అక్కడికి వచ్చిన 50 మంది మహిళలకు తాంబూలంతోపాటు మట్టి వినాయకప్రతిమలను అందజేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని చేయని మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కోరారు. **– రాజాం సిటీ**

కలెక్టర్కూ తప్పని ఇక్కట్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది రాజాం మండలంలోని మజ్జిరాముడుపేట వద్ద ఉన్న పాలకొండ రాజాం ప్రధాన రహదారి. మంగళవారం ఇదే రహదారిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సంకిలి నాగావళి నది పరిశీలనకు వచ్చారు. మజ్జిరాముడుపేట వద్ద గోతులమయమై, బురదతో చిత్తడిగా మారిన సుమారు అరకిలోమీటరు రోడ్డులో ప్రయాణించారు. రోడ్డంతా గోతులు, బురద ఉండడంతో కలెక్టర్ ప్రయాణిస్తున్న కారును నెమ్మదిగా పోనిచ్చారు. రోడ్డు బాగా లేకపోవడం వల్ల కలెక్టర్కు కూడా ఇక్కట్లు తప్పలేదని గ్రామస్తులు చర్చించుకున్నారు. సాక్షాత్తు కలెక్టర్ ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, ఆయనైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని మజ్జిరాముడుపేట గ్రామస్తులు కోరుతున్నారు. **– రేగిడి**

నాగావళిలో నీటి ప్రవాహం పరిశీలన



కె.ఆర్.పురం వద్ద నాగావళి నదిని పరిశీలస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

సంతకవిటి: మండలంలోని కె.ఆర్.పురం గ్రామంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మంగళవారం పర్యటిం చారు. నాగావళి నదిలో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వర్షాలు అనంతరం తలెత్తిన పరిస్థితులు, తీసు కున్న చర్యల గురించి మండల, జలవనరులశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ స్తులతో మమేకమయ్యారు. గ్రామానికి చెందిన ఓ మహిళ తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, నాగావళి నదిపై పోతులజగ్గుపేట వద్ద ఉన్న వంతెనకు రోడ్డు వేయాలని కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తామని, వంతెన వరకు రోడ్డు వేయించేలా చూస్తామని హామీఇచ్చారు. అనంతరం గ్రామంలో ఎన్ని ఎకరాల భూమి ఉంది, ఎన్నిటన్నుల ఎరువు వచ్చిందని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆరా తీశారు. కె.ఆర్.పురం, జావాం గ్రామాల్లో 880 ఎకరాల సాగుభూమి ఉందని, ఇంతవరకు 19 టన్నుల యూరియా వచ్చిందని వ్యవసాయ సిబ్బంది వివరణ ఇచ్చా రు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి ఎస్.శారదాదేవి, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీఓ కె.సురేష్ కుమార్, కె.ఆర్.పురం సర్పంచ్ పండు రాజగోపాలరావు, జావాం సర్పంచ్ బోనెల ప్రసాద రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.